"గురువు గారు! ఇందాక సర్వ జీవుల్లో వున్నది ఈశ్వరుడే అని మీరు చెప్పారు. మరి ఏనుగుల్లో కూడా ఈశ్వరుడు ఉన్నాడు కదా? ఆ ఈశ్వరుడికి ఎందుకు మీరు భయపడి పారిపోయారు?"

"పారిపోయింది కూడా ఈశ్వరుడే." బదులు చెప్పాడు గురువు.

## 71. ఈశ్వరుడి ఇచ్ఛ

ఓ సద్గురువు తన శిష్యులకి ధ్యాన యోగాన్ని నేర్పించి వాళ్ళని ఆధ్యాత్మికంగా అభివృద్ధి దిశలో నడిపిస్తున్నాడు. ఓ రోజు ఆ గురువు గారి కాళ్ళు స్వాధీనం తప్పాయి. నడవలేక మంచాన పడ్డాడాయన. శిష్యులంతా ఆ రోగానికి వైద్యం చేయించుకోమని ఆయన్ని ప్రార్థించారు.

"పూర్వ జన్మలో నేను చేసిన పాపానికి ఇది శిక్ష. దీన్ని అనుభవిస్తే కాని ఆ పాపం పోదు." నిరాకరించాడు గురువు.

"భగవంతుడ్ని ప్రార్థిస్తే మీ రోగాన్ని ఆయన తొలగించేస్తాడు కదా? పోనీ ఆ పని చేయండి." కోరారు శిష్యులు.

"పిచ్చివాళ్ళల్లారా! భగవంతుడి ఇచ్ఛ లేకుండా ఈ జబ్బు నాకు వచ్చిందనుకుంటున్నారా? ఇంక దీన్ని తొలగించమని ఆయన్ని నేనెలా ప్రార్థించేది?" నిరాకరిస్తూ చెప్పాడు గురువు.

## 72. శాంతి మార్గం

రకరకాల సమస్యలతో అల్లల్లాడుతున్న ఒక వ్యక్తికి, తమ గ్రామానికి ఓ బౌద్ధ భిక్షువు వచ్చాడని తెలిసింది. అతని దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"స్వామీ! నాకు శాంతి కావాలి. దాన్ని పొందే మార్గం చెప్పండి."

ఆ బౌద్ధ భిక్షువు నవ్వి జవాబు చెప్పాడు.

"'ఏముంది? 'నాకు కావాలి' తీసేస్తే ఇక మిగిలేదంతా శాంతే కదా నాయినా."